

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 2,126 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్ రావు తెలిపారు. 21 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 5 కేంద్రాల్లో వృత్తివిద్య ప్రాక్టికల్స్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో 1,191 మందికి 1,160 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షల్లో 984 మందికి 966 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 2,126 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

'పొత్తు' కుదరని ప్రచారం..!

టిడిపి, జనసేన నాయకుల తీరుపై సర్వత్రా చర్చ

నియోజకవర్గాల్లో ఎవరి ప్రచారం వారిదే

నేనే అభ్యర్థినంటూ జనాల్లోకి వెళ్తున్న ఇరుపార్టీల నేతలు

టిక్కెట్ల కేటాయింపుల్లో ఆలస్యంతో గందరగోళం

టిక్కెట్ల ప్రకటన తర్వాత సహకారం పరిస్థితి ఏమిటో అన్న అనుమానాలు



ఉంగుటూరు నియోజకవర్గంలో విడివిడిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన నాయకులు నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం రెండు జిల్లాలోనూ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయంటూ ఆయా పార్టీల అధినాయకులు ఇప్పటికే ప్రకటించారు. అసెంబ్లీ, ఎంపీ సీట్ల కేటాయింపులపై పార్టీ అధ్యక్షులు అనేక దఫాలుగా కూర్చుని చర్చించుకోవడం అందరికీ తెలిసిందే. ఇరు పార్టీల పొత్తుకు సంబంధించిన వ్యవహారం మాత్రం నియోజకవర్గాల్లో ఎక్కడా కానరావడం లేదు. టిడిపి, జనసేన నాయకులు ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు కొనసాగిస్తున్నారు. తానే ఎంఎల్ఎ అభ్యర్థినంటూ చెబుతూ టిడిపి, జనసేన నాయకులు జనాల్లోకి వెళున్న పరిస్థితి నెలకొంది. దీంతో టిక్కెట్ ఎవరికి అన్న చర్చ జనాల్లో విస్తృతంగా కొనసాగుతోంది. ముఖ్యంగా జనసేనకు ఉంగుటూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు లేక ఏలూరు అసెంబ్లీ స్థానాలను కేటాయించే అవకాశం ఉందని ఆది నుంచి ప్రచారం సాగుతోంది. ఆయా స్థానాల్లో ఇరు పార్టీల నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకులు ఎన్నికల ప్రచారం సాగిస్తుండడంతో అందరినీ గందగోళంలో పడేస్తోంది. ఉంగుటూరు నియోజకర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా గన్ని వీరాంజనేయులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగిస్తుండగా, అదేరీతిన జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరినట్లు అధినాయకుల ప్రకటించినప్పటికీ ప్రచారం మాత్రం ఎవరికి వారే అన్నట్లు చేసుకుంటున్నారు. నరసాపురం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. జనసేన నుంచి బొమ్మిడి నాయకర్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని జనాల్లోకి వెళ్తున్నారు. టిడిపి నుంచి కొవ్వలి రామ్మోహనరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా జనాల్లో తిరుగుతున్నారు. టిడిపి నుంచి మరో ఇద్దరు నాయకులు సైతం పొత్తూరి రామరాజు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు సైతం జనాల్లో ఉంటున్న పరిస్థితి నెలకొంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జనసేన ఉంచి బొలిశెట్టి శ్రీనివాస్, టిడిపి నుంచి వలవల బాబ్జీ ఇద్దరు ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు తిరుగుతున్నారు. ఏలూరులోనూ టిడిపి నుంచి బడేటి చంటి, జనసే నుంచి రెడ్డి అప్పలనాయుడు సైతం ఇదేవిధంగా ప్రచారం నిర్వహించుకుంటున్నారు. భీమవరంలోనూ టిడిపి, జనసేన నాయకులు వేరువేరుగా తమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. టిడిపి, జనసేన నాయకులు ఎవరి దారి వారిదన్నట్లు వ్యవహరిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ ఇద్దరు కలిసినా తమ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థికి టిక్కెట్ ఇస్తారా.. లేక జనసేకు ఇస్తారా అన్న చర్చ నెలకొంది. టిడిపి, జనసేన మధ్య ఎన్నికల పొత్తు కుదిరినప్పటికీ క్షేత్రస్థాయిలో నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండడం అందరినీ అయోమయానికి గురిచేస్తోంది. ఇరుపార్టీల అభ్యర్థులు విడివిడిగా తిరుగుతున్న తీరు చూసిన వారికి ఒకటో ఆలోచన కలుగుతోంది. టిక్కెట్ల కేటాయింపు తర్వాత టిక్కెట్ రాని వారు బరిలో ఉన్న అభ్యర్థికి సహకరిస్తారా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే క్షేత్రస్థాయిలో టిడిపి, జనసేన నాయకుల మధ్య ఏమాత్రం పొత్తు కుదరని పరిస్థితి నెలకొంది. అభ్యర్థుల ఎంపిక తర్వాత పరిస్థితి ఏంటన్న అభిప్రాయం అందరిలోనూ కొనసాగుతోంది. టిక్కెట్ల కేటాయింపులో అధిష్టానం వ్యవహరిస్తున్న తీరే ఈ పరిస్థితికి కారణమన్న అభిప్రాయం, టిడిపి, జనసేన నాయకుల్లోనూ వ్యక్తమవుతోంది.

ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్ర ప్రభుత్వం జిఒ 3 అమలు చేయకుండా 2024 డిఎస్‌సిలో ఆదివాసీలకు దగా చేసి గిరిజనేతరులకు 99 శాతం పోస్టుల్లో అవకాశం కల్పించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సందర్భంగా ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ నోటిఫై చేసిన 506 పోస్టుల్లో ఆదివాసీలకు దక్కేది కేవలం 25 మాత్రమేనా అని ప్రశ్నించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మొత్తం పాడేరు, రంపచోడవరంలో నోటిఫై చేసిన పోస్టులు మొత్తం 153 అయితే అందులో ఆదివాసీలకు దక్కేది 9 మాత్రమేనని, గిరిజనేతరులు పొందేది 144 పోస్టులని తెలిపారు. ఏలూరు జిల్లా షెడ్యూల్ ప్రాంతాల్లో నోటిఫై చేసిన మొత్తం పోస్టులు మొత్తం 280 అయితే, ఆదివాసీలకు దక్కేది కేవలం 12 పోస్టులేనని తెలిపారు. గిరిజనేతరులకు దక్కేది 268 పోస్టులని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 191 గిరిజన గురుకులాల్లో 517 డిఎస్‌సి పోస్టులు నోటిఫై చేశారని, అందులో పనిచేస్తున్న 517 ఔట్ సోర్సింగ్ టీచర్ పోస్టులు మాయం చేస్తోందని తెలిపారు. ఇందులో అత్యధిక మంది ఆదివాసీలు పనిచేస్తున్నారని, వారందరికీ డిఎస్‌సి ద్వారా తొలగించి గిరిజనేతరులకు పోస్టుల్లో అవకాశం కల్పించడం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. గతంలో ఆదివాసీలు జిఒ 3 ద్వారా నూరుశాతం రిజర్వేషన్ పొందేవారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సిలో ఆదివాసీల ప్రాంతంలో దాదాపు 99 శాతం పోస్టులు గిరిజనేతరులకు అవకాశం కల్పించి ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తక్షణం ప్రభుత్వం జిఒ 3 అమలు చేసి ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం జిఒ 3 అమలుకు చర్యలు తీసుకోకుండా ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం జిఒ 3 అమలు చేసి షెడ్యూల్ ప్రాంతాల్లో డిఎస్‌సి నియామకాల్లో వందశాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కొయ్యలగూడెం: గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలు అమలు చేసి న్యాయం చేయాలని లేకుంటే మరో దశ ఉద్యమానికి సమాయత్తం కావాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యర్రంపేటలో నిర్వహించిన గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. న్యాయమైన పరిహారం కోసం రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. నష్టపరిహారం పెంచాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కోర్టులో ఆర్బిట్రేషన్ దాఖలు చేసి సంవత్సరాలు గడుస్తున్నా తీర్పులు ఇవ్వడం లేదన్నారు. ఒకవైపు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని రైతులకు మాత్రం న్యాయం చేయకపోవడం భావ్యం కాదని తెలిపారు. మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం పెంచి రైతులకు న్యాయం చేయాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వెంబడి కొవ్వూరు, భద్రాచలం రైల్వే లైన్ పేరుతో మరలా భూసేకరణ జరుగుతుందని వార్తలు రావడంతో రైతులు ఆందోళనతో ఉన్నారని చెప్పారు. భూ సేకరణ పేరుతో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రైతులంతా సంఘటితంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కొడవటి రామకృష్ణ, పసల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

కొల్లేరులో అక్రమ చేపల చెరువులు తవ్వకుండా

ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు ఏర్పాటు

వన్యప్రాణుల విభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారి హిమశైలజ



కొల్లేరులో టాస్క్ ఫోర్స్ బృందాలతో హిమశైలజ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కొల్లేరు అభయారణ్యం ఐదో కాంటూరు పరిధిలో ఎక్కడా అక్రమ చేపల చెరువులు తవ్వకుండా ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వన్య ప్రాణుల విభాగం డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎం.హిమశైలజ తెలిపారు. అందులో భాగంగా ఆదివారం పైడిచింతపాడు, మల్లవరం, బొబ్బిలిలంక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హిమశైలజ మాట్లాడుతూ కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో ఎటువంటి అక్రమ చేపల చెరువుల తవ్వకాలు జరపకుండా పటిష్టమైన నిరోధక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఇప్పటికే అటవీశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. కొల్లేరు అభయారణ్యం పరిధిలో అక్రమ చేపల చెరువు తవ్వకాలు జరుగుతున్నాయని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో కొల్లేరు అభయారణ్య పరిరక్షణ కోసం రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షణ అధికారి వారి ఆదేశాల మేరకు డివిజనల్ అటవీశాఖ అధికారి వన్యప్రాణుల విభాగం వారి అధ్యక్షతన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నియమించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రాజమండ్రి సర్కిల్ పరిధిలోని అటవీశాఖ అధికారులను, సిబ్బందిని ఏలూరు వన్యప్రాణుల విభాగం కార్యాలయంలో సమావేశపర్చి వారికి అభయారణ్యం పరిరక్షణపై తగు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. సుమారు 52 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి కొల్లేరు అభయారణ్యంలో ప్రభుత్వ భూముల్లో చెరువుల తవ్వకాలు జరగకుండా తనిఖీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా పైడి చింతపాడు, మల్లవరం, బొబ్బిలిలంక గ్రామాలలో పర్యవేక్షించడం జరిగిందన్నారు. కొల్లేరు 5వ కాంటూరు పరిధిలో ఎటువంటి అక్రమ చేపల చెరువులు తవ్వకాలు జరపరాదని, అలా జరిపిన వారిపై వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీమ్‌ను కొల్లేరు అరణ్యంలో నిరంతరం గస్తీ తిరుగుతూ ఎక్కడ అక్రమ చేపల చెరువుల తవ్వకాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

పశ్చిమను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి
- హాజరుకానున్న 21,341 మంది విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా 85 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ





ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సన్నద్ధత, తీసుకున్న చర్యలు, చేసిన ఏర్పాట్లు వంటి అంశాలపై ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు. ఒక ఉపాధ్యాయునికి ఐదుగురు విద్యార్థులను దత్తత చేసి ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ చూపే విధంగా చర్యలు చేపట్టమన్నారు. ముఖ్యంగా సి, డి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 85 శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డిఇఒ వెంకటరమణ వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాది పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేస్తున్నారు?

డిఇఒ : విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించాం. ఏ కేటగిరి విద్యార్థులు నూటికి నూరు శాతం సాధిస్తారు. ముఖ్యంగా సి, డి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఐదుగురు చొప్పున ఒక ఉపాధ్యాయునికి దత్తత చేయడం జరిగింది. స్టడీ అవర్లో చదివించడం, రాయించడం వంటివి ఉపాధ్యాయుని ప్రథమ కర్తవ్యంగా ఆదేశించాం. ప్రతి విద్యార్థి పైనా ప్రత్యేక పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు చేపట్టాం.

ప్రశ్న : ఉపాధ్యాయ అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టారు?

డిఇఒ: విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలన్నదే మా తాపత్రయం. దీనికి అన్ని విధాలా చర్యలు చేపట్టాం. జిల్లా పరిషత్ ఛైర్మన్ అందించిన స్టడీ మెటీరియల్‌తో పాటు విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో సొంతంగా గణిత దీక్ష మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందించాం. ఈ మెటీరియల్ చదివితే విద్యార్థులు అవలీలగా ఉత్తీర్ణత సాధిస్తారు. తరగతులు పూర్తయ్యేంత వరకూ ఉపాధ్యాయులు సెల్ ఫోన్లు వినియోగించకుండా నో సెల్ఫోన్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చాం.

ప్రశ్న : గతేడాది ఏ విధంగా ఉన్నాయి. ఉత్తీర్ణతా శాతం ఎంత వచ్చింది?

డిఇఒ : గతేడాది 20,300 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 10 వేల మంది ఫస్ట్ క్లాస్, 2 వేల మంది సెకండ్ క్లాస్, 1500 మంది థర్డ్ క్లాస్ మొత్తం 13,500 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సుమారు 6,860 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గతంలో 65.9 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది మరో 20 శాతం పెంచి 85 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న : గతేడాది ఏ సబ్జెక్టులో ఎంతమంది ఫెయిల్ అయ్యారు, వారికోసం ఈ ఏడాది ఏం చర్యలు చేపట్టారు?

డిఇఒ : గతేడాది లెక్కల సబ్జెక్టులో 3,800 ఫెయిల్ అయ్యారు. 2 వేల మంది విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. 4,500 మంది విద్యార్థులు ఈ ఏడాది రెగ్యులర్ పరిధిలో పాఠశాలలో చేరారు. వీరంతా ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారు. రిజర్వ్ విద్యార్థులకు గతంలో వచ్చిన మార్కుల కంటే తక్కువ వస్తే పాత మార్కులే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. ఎక్కువ మార్కులు వస్తే పాత వాటితో సంబంధం లేకుండా ఎక్కువ మార్కులను పరిగణలోకి తీసుకుంటాం.

ప్రశ్న:ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు?

డిఇఒ: ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు రెగ్యులర్ విద్యార్థులు కలిపి 21,341 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. దీనిలో బాయ్స్ 14,624, గర్ల్స్ 12,802 మంది ఉన్నారు. గతేడాది ఫెయిల్ అయిన 6,085 మంది విద్యార్థులతో కలిపి మొత్తంగా 27,426 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్న : పరీక్షల నిర్వహణకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది అధికారులను నియమించారు?

డిఇఒ : జిల్లా వ్యాప్తంగా 127 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 24 మంది రూట్ అధికారులు, సెట్టింగ్ స్క్వాడ్లు, మరో ఆరుగురు స్క్వాడ్ అధికారులు, 1,325 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. గతంలో మాదిరిగానే సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. అలాగే విద్యార్థులు ప్రశాంతతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం.

ప్రశ్న : ఎప్పటి నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి? ఏ సమయంలో జరగనున్నాయి?

డిఇఒ : మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 30వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. మార్చి 18న తెలుగు పరీక్ష, 19న హిందీ, 20న ఇంగ్లీష్, 22న లెక్కలు, 23న ఫిజికల్ సైన్స్, 26న బయోలాజికల్ సైన్స్, 27న సోషల్, 28న ఒఎస్ఎస్‌సి, 30న సాంస్క్రీట్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 నిమిషాల వరకూ పరీక్షలు జరుగుతాయి. పక్షులకు గంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలి. నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించే పరిస్థితి ఉండదు. విద్యార్థులు గమనించాలి.

రజకులకు ప్రాధాన్యత లభించడం లేదు

26న ఉమ్మడి జిల్లాల రజక జన సంఘం మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సామాజికవర్గాల ప్రాధాన్యతలపై రాజకీయ పార్టీలు అణిచివేతకు పాల్పడుతున్నాయని, రాజకీయంగా, సామాజికంగా రజకులకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని రజక జనసంఘం జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఈనెల 26వ తేదీన ఉమ్మడి జిల్లాల రజక జన మాహాసభ ఏలూరులో నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఏలూరులోని జిల్లా రజక జన సంఘ కార్యాలయంలో నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడిచినా రజకుల సామాజిక స్థితి మారకపోవడం దురదృష్టకరమన్నారు. రజకులని కించపరుస్తూ మాట్లాడే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని, రజకుల ఆర్థికాభివృద్ధికి చట్టాలు చేసినప్పటికి, ప్రభుత్వ జిఒలు విడుదల చేసినప్పటికి అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు. రజకుల వృత్తి చెరువుల విషయంలో పంచాయతీలు ప్రభుత్వ జిఒలను ఏమాత్రం అనుసరించకపోవడం వల్ల రజకులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రజక సామాజికవర్గ గొంతు శాసనసభలో వినిపించాలంటే తప్పనిసరిగా రాజకీయ పార్టీలు రజకులకు అసెంబ్లీ స్థానాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రజకులను సమాయత్త పరచి చైత్యనం చేసేందుకు ఈనెల 26వ తేదిన జరగబోయే మహాసభ వేదిక కానుందని అన్నారు. రజకుల వృత్తి చెరువుల విషయంలో పంచాయతీల తీరును మార్చుకోవాలని, రజకుల వృత్తి చెరువులను పూర్తిస్థాయిలో నిర్ధారించేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పంచాయితీల్లోను, మార్కెటింగ్ కమిటీల్లోను, శాసనసభ, పెద్దల సభల్లోను రజక సామాజిక వర్గ ప్రజలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రజక జనసభలో రజకుల ఇబ్బందులపై పరిష్కార దిశగా తీర్మానాలు చేసి ప్రభుత్వం ముందు ఉంచనున్నామని చెప్పారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరిలతో పాటు ఏలూరు జిల్లాల పరిధిలోని రజకులను మహాసభకు సమాయత్త పరుస్తున్నామని కట్లయ్య చెప్పారు. సమావేశానికి ముందు ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.చంద్రశేఖర్‌ను కలిసి ఏలూరు డివిజన్ పరిధిలో రజకులు పడుతున్న ఇబ్బందులను వివరించగా సమస్యల పరిష్కారానికి క్రిందిస్థాయి అధికారులకు తగు సూచనలు ఇస్తానని డివిజనల్ పంచాయతీ అధికారి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రజక సీనియర్ నేతలు వి.శ్రీనివాసరావు, ఎలమంచిలి నాగ శేషు, కొమ్మంటి మురళీ, కనకపురి లక్ష్మణరావు, పున్నపు నరసింహారావు పాల్గొన్నారు.

20న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా, విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టిన విద్రోహ పార్టీ బిజెపి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని, బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీలను వ్యతిరేకించాలని, వామపక్ష, లౌకికవాద పార్టీలను బలపర్చాలని కోరుతూ ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీలు సంయుక్తంగా జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం, రాజధానికి నిధులివ్వకపోయినా టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి కొమ్ము కాస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి పూర్తిగా లొంగిపోయిన వైసిపి ప్రభుత్వం అనధికార ఎన్‌డియేగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రజలపై భారాలు వేయడమే కాకుండా ప్రశ్నిస్తున్న ప్రజలను అణచివేసే దౌర్జన్య పాలన సాగిస్తుందని తెలిపారు. ప్రకృతి సంపదను బడా కార్పొరేట్లపరం చేస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం ముందు తాకట్టు పెడుతూ, అవినీతిమయమైన వైసిపి, రాష్ట్రానికి ఒకప్పుడు ద్రోహం చేసింది బిజెపి అని గట్టిగా చెప్పి ఇప్పుడు అదే పార్టీతో జతకడుతున్న టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మేలు చేయకపోగా కీడు చేస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో బిజెపిని వ్యతిరేకించే వామపక్ష పార్టీలు, లౌకిక పార్టీలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కోరుకునే పార్టీలు, సంఘాలు, సంస్థలు, వ్యక్తులు ఉమ్మడిగా ఒక తాటిపైకి వచ్చి గళం వినిపించాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు. అందుకే సిపిఎం - సిపిఐ రాష్ట్ర కమిటీల చొరవతో ఈనెల 20వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేశారని, ఈ సదస్సుకు జిల్లా నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరై జయప్రదం చేయాలని రవి, కృష్ణచైతన్యలు కోరారు.

ఉత్తమ విద్యాబోధన ఇండో సాక్సన్ సొంతం



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న నాగరాజు

ముదినేపల్లి: ఉత్తమ విద్యాబోధన ఇండో సాక్సన్ సొంతమని రిటైర్డ్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎంవిజి ఆంజనేయులు అన్నారు. ముదినేపల్లిలోని ఇండో సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంజనేయులు మాట్లాడుతూ ఉత్తమ విద్యాబోధనకు చిరునామా ఇండోసాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అన్నారు. స్కూల్ కరస్పాండెంట్ ఎంజె జార్జ్ మాట్లాడుతూ స్కూలు దినదినాభివృద్ధి చెందుతూ మండలంలో విజయపథంలో ముందుకు దూసుకుపోతోందన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ సాలి మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది గ్రామస్తుల సహకారంతో ఈ విద్యాసంస్థను నడుపుతున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి ప్రదర్శనలు అందరిని ఆలోచింపచేశాయి. విద్యార్థులు ఉల్లాసంతో, ఉత్సాహంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా ముగిసింది. తొలుత కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంజనేయులు, ఎ.సాబుజాన్, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నాగరాజులను కరస్పాండెంట్ జార్జి శాలువాలు కప్పి పూలమాలలతో, మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అలాగే పాఠశాలలో వివిధ అంశాలలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు జార్జ్ నగదు పురస్కారాలు, మెమొంటోళ్లను అతిథుల చేతులు మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు భారీగా తరలివచ్చారు.

ఐసియులో.. రోగుల అవస్థలు..!

ఏలూరు 'సర్వజన ఆసుపత్రి'లో రోగుల పరిస్థితి దారుణం
సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు
ఐసియులో పనిచేయని ఎసిలు
ఇంటివద్ద నుంచే ఫ్యాన్లు తెచ్చుకుంటున్న వైనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న సామెత ఎందుకు వచ్చిందో కానీ.. ఏలూరు సర్వజన ఆసుపత్రి తీరు చూస్తుంటే అది నిజమే అనిపిస్తుంది. గతంలో జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడే మెరుగైన సౌకర్యాలు ఉండేవని, మెడికల్ కళాశాల పరిధిలోకి వచ్చాక మెరుగైన సౌకర్యాలు అందకపోగా ఉన్న సౌకర్యాలు కూడా రోజురోజుకీ తగ్గిపోయి రోగులు ఇబ్బంది పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

వివరాల్లోకి వెళితే గతంలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అనేకమంది వైద్యులతో, సౌకర్యాలతో, వసతులతో రోగులకు అనేక సేవలు అందించే పరిస్థితిలో ఉండేది. రోజుకు సుమారు 1500 మంది అవుట్ పేషెంట్లు ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి చికిత్స అందుకునేవారు. అంతేకాక 450 పడకలతో, ఎయిర్ కండిషన్ ఐసియుతో, ప్రత్యేక ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్ర భవనంతో కిటకిటలాడుతూ ఉండేది. అయితే 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్య కళాశాలకు ఆసుపత్రి ప్రాంగణంలో శంకుస్థాపన చేయటం, తరువాత ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మరో రెండు సార్లు వైద్య కళాశాలకు శంకుస్థాపన చేయటం జరిగింది. ఎట్టకేలకు 2023లో వైద్య కళాశాల పనులు ప్రారంభించడం, సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభిస్తామని ప్రకటించడంతో ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల సుమారు 20 గ్రామాల ప్రజలు 'ఏలూరుకు వైద్య కళాశాల వచ్చేస్తుందట' అని సంబరపడ్డారు.

గతంలో సాధారణ వైద్యులు ఉండేవారని, జిల్లా ఆసుపత్రి వైద్య కళాశాల అనుబంధ బోధన ఆసుపత్రిగా మారితే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వస్తారని, మెరుగైన వైద్య సేవలు అందుతాయని, పరీక్షలు, చికిత్సకు హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్ళక్కర్లేదని, ఏలూరులోనే అన్ని సౌకర్యాలు ఉంటాయని ప్రజలు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. అనుకున్నట్టుగానే వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడిచే జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కంట్రోల్లోకి వెళ్లటం, 2023 సెప్టెంబర్‌లో వైద్య కళాశాల తరగతులు ప్రారంభించడం జరిగిపోయాయి. కానీ సర్వజన ఆసుపత్రిలో అనుకున్న స్థాయిలో సౌకర్యాలు మెరుగుపడలేదు సరి కదా ఉన్న సౌకర్యాలు కూడా అందుబాటులో లేని పరిస్థితుల్లోకి వచ్చింది.

తీవ్రమైన రోగాలతో బాధపడుతూ ఐసియులో చికిత్స పొందుతున్న రోగులకు అక్కడ ఉన్న ఎసి పని చేయకపోవడంతో ఇంటి దగ్గర నుంచి సొంత ఫ్యాన్లు తీసుకొచ్చి పెట్టుకోవాల్సిన దుస్థితి రావటమే ఇందుకు ఉదాహరణ. జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఐసియు వార్డులో 21 పడకలు ఉన్నాయి. ఐసియు పూర్తి ఎయిర్ కండిషన్ కావడంతో ఆరు ఎసిలు ఉన్నాయి. నిత్యం అక్కడ పూర్తిస్థాయిలో రోగులు చికిత్స తీసుకుంటూ ఉంటారు. ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొల్లేరు లంక గ్రామాల ప్రజలు, జానంపేట, విజయరాయి, ధర్మాజీగూడెం, లింగపాలెం, ముండూరు, వేగివాడ, తడికలపూడి, కామవరపుకోట, దెందులూరు, భీమడోలు, కృష్ణా జిల్లాలోని బాపులపాడు, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల నుంచి నిత్యం రోగులు తీవ్ర రోగాలతో వచ్చినప్పుడు వారికి ఐసియులో చికిత్స అందిస్తూ ఉంటారు. అంతేకాక ఇటు చింతలపూడి, నూజివీడు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి నుండి కూడా రోగుల పరిస్థితి తీవ్రంగా ఉంటే ఏలూరు సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేస్తూ ఉంటారు. వారి తీవ్రతను బట్టి ఐసియులో చికిత్స అందిస్తూ ఉంటారు. అయితే గత 15 రోజులుగా ఐసియులో ఎసిలు పనిచేయకపోవడంతో అక్కడ చికిత్స పొందుతున్న రోగులు వారి ఇంటి వద్ద నుంచే స్టాండ్ ఫ్యాన్లు తెచ్చుకొని పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సాధారణంగా అందరి ఇళ్లల్లో స్టాండ్ ఫ్యాన్లు ఉండవు. చాలావరకు సీలింగ్ ఫ్యాన్లు మాత్రమే ఉంటాయి. కానీ శీతాకాలం వెళ్లిపోయి ఎండలు ముదురుతున్న ఈ పరిస్థితుల్లో ఫ్యాన్ కచ్చితంగా ఉండాల్సిన పరిస్థితి రావడంతో కొంతమంది రోగులు చికిత్స పొందుతున్న మూడు, నాలుగు రోజుల కోసం రూ.3 వేలు ఖర్చుపెట్టి స్టాండ్ ఫ్యాన్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద రోగులు మాత్రమే ఎక్కువగా చికిత్స తీసుకుంటూ ఉంటారు. స్తోమత ఉన్న వారంతా ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఉంటారు. అసలే పేదరికంలో ఉన్న వారు రూ.3 వేలు ఖర్చుపెట్టి ఫ్యాన్ కొనాల్సి రావడంతో రోగులు లబోదిబోమంటున్నారు. గతంలో ఎసిలు పాడైతే మరమ్మతులు చేయటం జరిగిందని, అయినప్పటికీ మళ్లీ ఎసిలు పనిచేయని పరిస్థితి నెలకొందని తెలుస్తుంది. దీంతో రోగులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ పని చేసుకుంటూ పూట గడవడం కష్టమైన తమకు రూ.3 వేలు పెట్టి ఫ్యాన్లు కొనాల్సిన దుస్థితి వచ్చిందని వాపోతున్నారు.


ఐసియులో ఇంటినుంచి తెచ్చుకున్న ఫ్యాన్లతో పేషెంట్స్

గతంలో జిల్లా ఆసుపత్రిగా ఉన్న సమయంలో సంవత్సర కాలానికి ఆసుపత్రి మెయింటెనెన్స్ కాంట్రాక్టు ఇచ్చేవారు. ఆసుపత్రిలో ఉన్న పరికరాలకు ఎలాంటి మరమ్మతులు చేయాలన్నా ఆ కాంట్రాక్టర్ చేసి సంవత్సరానికి ఒకసారి ప్రభుత్వం నుంచి బిల్లు తీసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కంట్రోల్లోకి ఆసుపత్రి వెళ్లిన తర్వాత కేవలం రూ.20 వేల వరకు మాత్రమే అత్యవసర పరిస్థితుల్లో ఖర్చు పెట్టే అధికారం నివాస వైద్యాధికారికి ఉంది. రూ.20 వేలు దాటితే ఎపి మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా చేయించాల్సిన పరిస్థితి ఉంది. దానివల్ల ఏదైనా మరమ్మత్తులు వస్తే ఆసుపత్రి అధికారులు అంచనాలు తయారు చేసి ఎపిఎంఐడిసికి పంపించటం, అక్కడ వారు పరిశీలించి మంజూరు చేయటం జరుగుతుంది. దీంతో కాలయాపన జరగటం వల్ల రోగులు ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తుతుంది. ఆసుపత్రి, వైద్యం, వైద్యులు అత్యవసర సర్వీసులోకి వస్తారు.. కనుక ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా నిర్ణయం తీసుకునేందుకు అధికారులకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఈ విషయంలో తామేమి చేయలేమంటూ అధికారులు కూడా పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించి అత్యవసర మరమ్మత్తుల కోసం కొంత నిధులు కేటాయించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో నిర్ణయం తీసుకునే అధికారం కూడా ఆసుపత్రి అధికారులకు ఇస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరి రోగులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కాబట్టి ఇప్పటికైనా ఈ విషయంలో జిల్లా అధికారులు సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ విషయంపై ఆసుపత్రి ఇన్‌ఛార్జి, పర్యవేక్షణా అధికారి పిఎఆర్ ఎస్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎపిఎంఐడిసికి అంచనాలు పంపించడం జరిగిందని, అక్కడి నుంచి అనుమతి వస్తే వెంటనే సమస్య పరిష్కరించడం జరుగుతుందని, అంతకుమించి నిర్ణయం తీసుకునే అధికారం తమ పరిధిలో లేదని తెలియజేశారు.


తహశీల్దార్‌కు వినతినిస్తున్న లబ్ధిదారులు

నివాసయోగ్యమైన స్థలాలు కేటాయించాలి

తహశీల్దార్‌కు లబ్ధిదారుల వినతి

ప్రజాశక్తి - ముసునూరు

కేటాయించిన ఇళ్ల స్థలాలు కాకుండా నివాసయోగ్యానికి అనుకూలంగా ఉన్న స్థలాలు కేటాయించమని తహశీల్దార్ జోహర్ బాజీకి లబ్ధిదారులు ఆదివారం వినతిని అందించారు. ముసునూరులోని వలసపల్లి వెళ్లే రోడ్డు వాగుపక్కన లబ్ధిదారులకు గతంలో ఇళ్ల స్థలాలు చూపించారు. ముఖ్యంగా ఆ భూముల్లో ఇళ్ల స్థలాలు తీసుకోవటానికి లబ్ధిదారులందరూ వ్యతిరేకిస్తున్నారు. ప్రతి ఒక్కరు కూడా వద్దంటే వద్దని ధర్నాలు చేశారు. ఆ భూమి ఇచ్చిన రైతులు కూడా ప్రభుత్వం వారు ఇచ్చిన నగదు తిరిగి చెల్లించుటకు సిద్ధంగా ఉన్నారు. ఆమోదమైన భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని లబ్ధిదారులు తహశీల్దార్‌కు వినతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేగుల గోపాలకృష్ణ, గుంటూరు రంగారావు, చిన్నం రవి, నగుళ రాంబాబు, యం.బాబురావు పాల్గొన్నారు.

21న కొబ్బరి చిప్పల పోగుకు వేలంపాట

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చేనెల 7, 8, 9, 10 తేదీల్లో జరుగు మహాశివరాత్రి ఉత్సవాల్లో కొబ్బరి చిప్పలు పోగుచేసే హక్కుకు ఈనెల 21వ తేదిన బహిరంగ వేలంపాట నిర్వహించబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు అన్నారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం వేలంపాట నిర్వహించగా సదరు పాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో, మరలా ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు బలివే ఆలయం వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు పర్యవేక్షణ, పలు గ్రామాల పెద్దల సమక్షంలో నిర్వహించబడునని తెలియజేశారు.


చెక్కును అందిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి

వైఎస్ఆర్ ఆసరా సొమ్ము జమ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం 4, 5, 6, 7 సచివాలయాల పరిధిలోని గర్ల్స్ హైస్కూల్ రాజుల కాలనీలో వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మొత్తం నాలుగు సచివాలయాలకు 380 మంది ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులకు రూ.4.83 కోట్లు ఆసరా నిమిత్తం మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, జెడ్‌పిటిసి పోలినాటి బాబ్జి, వైసిపి సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, స్థానిక వార్డు కౌన్సిలర్ పిపిఎన్ చంద్రరావు, తాతకుంటల నాగలక్ష్మి పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న ఎంఎల్ఎ

చందు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని సరిపల్లి పంచాయతీ ధర్మారావు గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు అదేపల్లి చందు చనిపోవడంతో అతని తల్లిదండ్రులు అదేపల్లి లాజరు, మేరీని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజవర్గ ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మి పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొడ్డాటి నాగేశ్వరావు, వైసిపి గ్రామ కన్వీనర్ మందపాటి రామకృష్ణ, ఎంపిపి గంజిమాల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఏలూరు సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ ప్రమాణస్వీకారం మహోత్సవానికి చీఫ్ విఫ్ ముదునూరు ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరై ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి యాత్రికులు, గ్రామస్తులు హాజరు కావాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బైకును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని భువనగిరి గ్రామం వద్ద భద్రాచలం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు అల్లిగూడెం గ్రామం వైపు వెళ్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో తురసం శివ, మద్దిబోయిన రాంప్రసాద్ యువకులు గాయాలపాలయ్యారు. వారిని తక్షణమే భద్రాచలం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.


బైకును ఢీకొన్న బస్సు

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ఉదయ భాస్కర్ కాలనీ గ్రామ శివారులో ఆదివారం కోడి పందేల శిబిరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ టి.రాధకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉదయ భాస్కర్ కాలని గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తూన్నారని సమాచారం మేరకు దాడులు చేయగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లు, ఒక కోడి కత్తిను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

జనసేనను బలంగా తీసుకెళ్లాలి

నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

జనసేనని గ్రామీణ స్థాయిలో బలంగా తీసుకు వెళ్లాలని జనసేన నియోజకవర్గం కన్వీనర్ మేక ఈశ్వరయ్య అన్నారు. చింతలపూడి నగర పంచాయతీలోని షాదిఖానాలో జనసేన మండల సభ్యులు, గ్రామ అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, జనసైనికులు, వీర మహిళలు అత్యవసర సమావేశం జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చీదరాల మధు

వృద్ధాశ్రమం ప్రారంభం

మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య

ప్రజాశక్తి - చాట్రాయి


మండలంలోని గ్రామాల్లో ఏ దిక్కులేని, ఆదరించే వారు లేక బాధపడే వృద్ధులకు ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశంతో వృద్ధాశ్రమాన్ని పెట్టడం జరిగిందని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ, ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న చిన్నం రామకోటయ్య అన్నారు. మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో ఆదివారం వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్రికావిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి చిన్నం సుబ్బారావు పేరుతో వృద్ధాశ్రమాన్ని పెట్టడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, వైద్య సదుపాయం కూడా తానే కల్పిస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. త్వరలోనే ప్రచారం నిర్వహిస్తానని, దానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చూసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ముందుగానే ఏజెంట్లు ఏర్పాటు చేసి, వారి ద్వారా ఏ గ్రామంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారని లిస్టు తయారుచేసి ఓటర్లను కలవడం జరుగుతుందన్నారు. వృద్ధాశ్రమానికి సంబంధించి చాట్రాయి మండలంలో ఉన్న దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రతి కంటి రామచంద్రరావు, గోళ్ల మోహన్ రావు, వీసం నరసింహారావు, సురేష్, గోళ్ల గుర్నాథరావు, సత్యనారాయణ, గోళ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకోటయ్య

వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పాల్గొని సేవా వజ్రా, సేవారత్న, సేవా మిత్రాలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, నగదు పురస్కారాలను అందించి దుశ్శాలువాలుతో వాలంటీర్లను సత్కరించారు. బొమ్మినంపాడు సచివాలయం నుంచి పోనుమూడి నాగబాబుకు సేవావజ్రా పురస్కారం, అల్లూరు నుంచి మందాడ నాగలక్ష్మి, బొమ్మినంపాడు నుంచి దండే శారద, పెదగొన్నూరు నుంచి సాయల నాగమల్లేశ్వరరావు, పేరూరు నుంచి గొర్ల ఈశ్వరి దుర్గ, వణుదుర్రు నుంచి కురేళ్ల స్రవంతిలకు సేవారత్న పురస్కారాలను, సేవామిత్రా పురస్కారాన్ని అందించారు. అనంతరం కొర్రగుంటపాలెం వాలంటీర్‌గా పనిచేస్తూ ఉమ్మడి గోదావరి జిల్లా గడప గడపకు మన ప్రభుత్వ నోడల్ అధికారి బండారు వల్లిదేవిని దుశ్శాలువతో డిఎన్ఆర్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటాసంధ్య, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు బేతపూడి వెంకటరమణ, ఎఎంసి వైస్ ఛైర్మన్ బత్తిన కిషోర్, సర్పంచ్లు నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు, పేరే రామకృష్ణ, సింగనపల్లి రామకృష్ణ, అర్జా రామ జోగయ్య పాల్గొన్నారు.


వాలంటీర్లకు అవార్డు ఇస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ఆదిత్య కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఆదివారం ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీ వారు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు జిల్లాలోని అన్ని ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన సుమారు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం రావటం కష్టంగా ఉందని, కానీ తమ ఆదిత్య సంస్థలో ప్రతిరోజూ విద్యార్థులకు తాము నిర్వహించే సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ శిక్షణా తరగతుల మూలంగానే ఉద్యోగాల కల్పన సాధ్యపడుతోందన్నారు. ఉద్యోగాలు కల్పించడానికి తమ యాజమాన్యం ఎల్లపుడు ముందుంటుందన్నారు. డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆదిత్యలో చదివితే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ప్లేస్‌మెంట్ అధికారులు, వివిధ విభాగాధిపతులు,అధ్యాపక అధ్యపకేతర బృందం పాల్గొన్నారు.

రోడ్డేయండి మహాప్రభో..!

ప్రజాశక్తి - చింతలపూడి

ఆ ప్రాంతంలో సరైన రోడ్డు, బస్సు సౌకర్యం, అత్యవసర సమయంలో 108 వంటి సౌకర్యాలు ఏమీ లేవు. ఇప్పటికి ఎన్నోసార్లు పాలకులకు రోడ్లు వేయమని అర్జీలు పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ఆ గ్రామ ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసుకోవడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్నికల ముందైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు.


అధ్యానంగా రహదారి

చింతలపూడి మండలం శెట్టివారిగూడెం వయా సీతానగరం రోడ్డు వెంబడి ఆరు గ్రామాల్లో 10 వేల జనాభా, 7 వేల మంది ఓటర్లు ఉన్నారు. 1984వ సంవత్సరంలో కోటగిరి విద్యాధరరావు మొదటగా ఆ రోడ్డు నిర్మాణం చేపట్టారు. 1994లో ఆ రోడ్డు మరమ్మతులు చేయించారు. 2004 సంవత్సరంలో అప్పటి ఎంఎల్ఎ గంటా మురళీ ఆ రోడ్డుకి మరమ్మతులు చేయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం 15 కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రోడ్డుకి మరమ్మతులు కూడా చేయించని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు మారినా, పాలకులు, అధికారులు మారినా ఆ రోడ్డు పరిస్థితులు మారలేదు. ఆ రోడ్డు మీద వెంబడి ప్రజల తలరాతలు మారలేదు.


గోతులమయమైన రహదారి

గత ప్రభుత్వంలో కాని, ఇప్పుడున్న ప్రభుత్వంలో కాని ఆ రోడ్డు వెంబడి గ్రామాలలో పర్యటించడం కానీ, ప్రభుత్వం కార్యక్రమాలు సమావేశ నిర్వహించడం కానీ లేని పరిస్థితి. జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టినా కనికరం చూపడం లేదని ఆ రోడ్డు వెంబడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో 108 బస్సు సౌకర్యం కూడా లేని పరిస్థితి. గతంలో ఇదే రోడ్డు వెంబడి ప్రజలకు మూడు బస్సు సర్వీసులు ఉన్నాయని, రోడ్లు గుంతలు గుంతలుగా పడి అద్వానంగా తయారై ఇప్పుడు కనీసం బస్సు సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టాలని వారు కోరుకుంటున్నారు.

రోడ్డు వేయాలని పాదయాత్ర చేశాం
చిదరాల మధు, జనసేన మండల అధ్యక్షులు

రోడ్డు వేయించాలని జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించాం. అయినా ప్రభుత్వంలో చలనం రాలేదు. ఈ రోడ్డు వెంబడి విద్యార్థులు, యువతకు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. త్వరలోనే ఈ రోడ్డు వేయించాలని కార్యచరణ చేపడతాం.

మా ఊరు రోడ్డుని మరిచిపోయారు
మూడు రవి, నామవరం

మా ఊరు రోడ్డుని ప్రజా ప్రతినిధులు, అధికారులు మర్చిపోయారు. విద్యార్థులు కనీసం కాలేజీ, పాఠశాలకు వెళ్లడానికి లేని పరిస్థితి. కనీసం పాఠశాలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు సమస్యలు దృష్టిలో పెట్టుకొని రోడ్డు వేయించాలని కోరుతున్నారు.